
సాక్షి కాకినాడ

శుక్రవారం । 19 । మే । 2023



మిగులు జలాల విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 12,273 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.45 అడుగులకు చేరింది.



అయ్యోర్లకు తీపి కబురు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేలా విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది.

8లో



నగరం	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	41.5	28.0
కాకినాడ	38.5	28.0
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సమీక్ష

కాకినాడ సిటీ: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫొటో ఎపిక్ కార్డుల పంపిణీ, కొత్త జిల్లాల్లో ఈవీఎం గొడౌన్ల ఏర్పాటు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధి-విధానాలపై రూపొందించిన ప్రజెంటేషన్లను కలెక్టర్ కృతికా శుక్లా సీఈవోకు వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సిబ్బంది డేటా బేస్ ప్లానింగ్ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, ఇన్‌చార్జి డీఆర్వో కె శ్రీరమణి, కుడా వీసీ కె సుబ్బారావు, ఆర్డీవోలు బీవీ రమణ, జె సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో శ్రీరమణి

కాకినాడ సిటీ: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ 1వతేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జి డీఆర్వో కె శ్రీరమణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి జిల్లాలోని వివిధ ఆఫీసర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తారన్నారు. జిల్లాలో 39 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు శ్రీరమణి పేర్కొన్నారు. ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు తూర్పుగోదావరి జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం, జీజీకె నూకరాజు, పోలీస్, మెడికల్, మున్సిపల్, జిల్లా విద్యాశాఖాధికారి, ఏపీ ఎస్‌ఆర్టీసీ, పోస్టల్, ఏపీఈపీడీసీఎల్, డీపీవో, డీఎల్‌పీవో, డీపీఆర్వో తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం ఓపీ సేవలు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో గురువారం మధ్యాహ్నం ఓపీ సేవలు ప్రారంభమయ్యాయి. కీలక విభాగాలన్నింటిలోనూ ఈ రివ్యూ సేవలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకూ ఈ సేవలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి బృందంలో కలిసి పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం సేకరణలో అక్రమాలు.. ఇద్దరు మిల్లర్లపై చర్యలు

కాకినాడ సిటీ: అధిక తేమ, నూకల శాతం వంటి సాకులతో ధాన్యం కొనుగోలులో రైతుల నుంచి అదనంగా సొమ్ము తీసుకున్నా, అధిక పరిమాణం ధాన్యం సేకరించినా కఠిన చర్యలు చేపడతామని మిల్లర్లను జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ హెచ్చరించారు. గురువారం రాత్రి ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జిల్లాలోని రెండు రైస్ మిల్లులకు నోటీసులు జారీ చేశామన్నారు. తహసీల్దార్ల విచారణ ఆధారంగా, జగ్గంపేట మండలం రాజపూడిలోని వెంకటదుర్గారైస్ మిల్లు, పిఠాపురంలోని రెడ్డిరామకృష్ణ రైస్ మిల్లులకు ఈ నోటీసులు జారీ చేసినట్లు జేసీ తెలిపారు. ఆర్బీకేల నుంచి ఈ మిల్లులను తప్పించామన్నారు. , అదనంగా వసూలు చేసిన సొమ్మును, అదనంగా తీసుకున్న ధాన్యం విలువ రాబట్టి బాధిత రైతులకు ఇప్పించాలన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఏఓ సస్పెన్షన్

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న కళాధర్‌ను కలెక్టర్ హిమాన్షుశుక్లా విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఏటగా పనిచేస్తున్న కళాధర్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ హిమాన్షు శుక్లా శాఖాపరమైన విచారణ నిర్వహించారు. విచారణలో అవినీతికి పాల్పడినట్లు విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను ఇబ్బందులకు గురిస్తున్నట్లు తేలింది. దీనిపై డీఎం అండ్ హెచ్‌ఓ ఎం.దుర్గారావు దొరను వివరణ కోరగా కళాధర్ సస్పెండ్ అయిన విషయం వాస్తవమే అన్నారు.

సత్కార్యాలకు సత్కారం

- సేవలకు గుర్తింపుగా వలంటీర్లకు అవార్డుల ప్రదానం
- జిల్లా వ్యాప్తంగా 11,082 మంది ఎంపిక
- నేటి నుంచి పదిరోజుల పాటు కార్యక్రమాలు
- నగదు పురస్కారంతో సత్కరించనున్న ప్రభుత్వం





మంచానికే పరిమితమైన వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్లు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లు వారధిగా నిలుస్తున్నారు. కీలక భూమిక పోషిస్తూ లబ్ధిదారుల మన్ననలందుకుంటున్నారు. తొలినాళ్లలో వినిపించిన విమర్శలకు వీరు తమ పనితీరుతో దీటైన సమాధానమిస్తున్నారు. ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. వీరందిస్తున్న సేవలకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిస్తోంది. ఉత్తమ సేవలందించిన వారికి మూడేళ్ల నుంచి అవార్డులను ప్రదానం చేస్తూ ప్రోత్సహిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలకు అనుసంధానంగా పనిచేస్తున్న వీరి పనితీరు ఆధారంగా నగదు పారితోషికంతో పాటు సర్టిఫికెట్స్,బ్యాడ్జీలు,మెడల్స్ అందిస్తోంది. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం నిర్వహించ తలపెట్టింది. వలంటీర్లకు వందనం పేరుతో రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి అవార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

సీఎం ప్రారంభించాక రాష్ట్ర వ్యాప్తంగా పదిరోజులు పాటు నియోజకవర్గాల్లో అవార్డుల ప్రదాన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. పట్టణం, మండలంలో రోజుకు రెండు గ్రామాలు,రెండు సచివాలయాలకు తగ్గకుండా వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం వలంటీర్ల పనితీరు ఆధారంగా ఉత్తమ అవార్డులకు ఎంపిక పూర్తి చేసింది. జిల్లాలోని కాకినాడ నగరపాలక సంస్థ, మరో ఆరు మున్సిపాలిటీలతో పాటు 20 మండలాల్లో 11,273 మంది గ్రామ, వార్డు వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వీరిలో అత్యుత్తమ సేవలు అందించిన 39 మంది సేవా వజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. 152 మంది సేవా రత్న అవార్డుకు, 11,082 మంది సేవా మిత్రలుగా ఎంపికయ్యారు. అవార్డులు ప్రదానం చేయడానికి అవసరమైన శాలువాలు, బ్యాడ్జీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు ఆయా మండలాలకు, పట్టణాలకు చేరవేశారు. నగదు పారితోషికం సొమ్ము నేరుగా వలంటీర్ల ఖాతాల్లోకి జమ చేయనున్నారు.

పనితీరు ఆధారంగా..

ఏడాది పూర్తి చేసుకుని ఏవిధమైన ఫిర్యాదులు లేకుండా పనిచేసిన వలంటీర్లు అవార్డులకు అర్హులు. వారి సేవల ప్రాతిపదికన సేవా అవార్డులు అందజేస్తున్నారు. పనితీరుతో పాటు వలంటీర్ల సేవలపై వారి పరిధిలోని కుటుంబాలు వ్యక్తం చేసే సంతృప్తిని పరిగణనలోకి తీసుకున్నారు. ప్రతీ నెల మొదటి రోజు నూరు శాతం పంపిణీ, కుటుంబ సర్వే, సంక్షేమ పథకాల అమలులో పనితీరు వంటివి కూడా పరిశీలించి ఎంపిక చేశారు. నియోజకవర్గంలో ఐదుగురికి సేవ వజ్ర, మండలం, పట్టణానికి ఐదుగురు సేవ రత్నలను ఎంపిక చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

జిల్లా వ్యాప్తంగా 4,95,020 ఇళ్లకు సంబంధించి 512 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. వీటిలో 271 గ్రామాల్లో 393 గ్రామ సచివాలయాలు,పట్టణ ప్రాంతాల్లో 119 వార్డు సచివాలయాలున్నాయి. ప్రతీ యాభై కుటుంబాలకు ఒకరు చొప్పున 9,036 మంది వలంటీర్లులు ఉండాలి. ప్రస్తుతం 8,927 మంది వలంటీర్లులు పనిచేస్తున్నారు. మరో 109 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సేవరత్న అవార్డు కింద రూ.10వేలు,సేవా మిత్ర పురస్కారం కింద రూ.20వేలు, సేవావజ్రకు రూ.30వేలు వంతున అందజేయనున్నారు. ఇందుకోసం జిల్లాకు రూ.8,89, 20,000 వెచ్చించనుంది. జిల్లా వ్యాప్తంగా సేవ మిత్ర అవార్డులకు 8,549 మంది,122 మంది సేవ రత్న, 33 మంది సేవ వజ్ర అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో 5,627 మంది మహిళలు అవార్డులు పొందనున్నారు.

సేవలకు గుర్తింపు



ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో వలంటీర్‌గా చేరాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికి ప్రచారం చేయడంతో పాటు వాటిని స్వయంగా అందజేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రతిష్టాత్మకమైన సేవలు చేసే అవకాశం కలిగింది. పేదలకు ప్రభుత్వ పరమైన సేవలు అందించడం జీవితంలో మరిచిపోలేను. పేద వర్గాల సేవలో నన్ను భాగస్వాములను చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటాం.

– పలివెల మునలయ్య, వలంటీర్, యండమూరు, కరప మండలం

సీఎం జగన్‌కు అభినందనలు



గ్రామంలో పేదలు, వృద్ధులు, వికలాంగులకు చేస్తున్న సేవ ఎంతో సంతృప్తినిస్తోంది. ఈ సేవ చేసేందుకు వలంటీర్‌గా నియమించారు. పేదలకు సేవ చేసే భాగ్యం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ధన్యవాదాలు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను స్వయంగా ఇంటింటికి తీసుకెళ్లి ఇవ్వడం, పేదలకుసేవ చేయడం ఎంతో ఆనందాన్నిస్తుంది. ఇటువంటి వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి పేదలకు సేవలు చేసే భాగ్యం కల్పించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక అభినందనలు.

– బొమ్మిడి అజయ్, వలంటీర్, ఉప్పలంక, కరప మండలం

సేవలతో సంతృప్తి



ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు పేదలకు సేవలు చేసేందుకు ప్రభుత్వం కల్పించిన వలంటీర్ వ్యవస్థ ఎంతో ప్రయోజకరంగా ఉంది. గ్రామాల్లో పేదలకు ఏ సమస్య వచ్చినా ఎవరికి చెప్పుకోలేకపోయేవారు. అటువంటి వారి ఇంటికి స్వయంగా వెళ్లి సమస్యలు పరిష్కరించడం ఒక ఎత్తయితే, ప్రతినెలా ఒక టోవ తేదీన పెన్షన్ ఇవ్వడం, ఆ పేదల మోములో కన్పిస్తున్న ఆనందం ఎంతో సంతృప్తిని ఇస్తుంది. సేవలకు ప్రభుత్వం పురస్కారాలు అందించడం అభినందనీయం.

– పోతాబత్తుల రాజేశ్వరి, వలంటీర్, తూరంగి, కాకినాడ రూరల్

‘లాట్’ పేరుతో లూటీ

స్క్రాప్ తరలింపులో అవకతవకలపై కలెక్టర్ ఆరా

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో కాలం చెల్లిన ఉపకరణాల తరలింపు(స్క్రాప్)లో మోసం జరిగినట్లు వచ్చిన ఆరోపణపై కలెక్టర్ కృతికా శుక్ల గురువారం ఆరా తీశారు. పత్రికల్లోని ప్రచురితమైన వార్తల ఆధారంగా ఆర్‌ఎంసీ యాజమాన్యాన్ని ఆమె నివేదిక కోరారు. దీంతో విచారణ బృందం గురువారం సాయంత్రానికి నివేదికను సిద్ధం చేసింది. ఐదు వాహనాల్లో పాటదారుడు బుద్దాల శ్రీను స్క్రాప్‌ను తరలించినట్లు విచారణ బృందం నిర్ధారించింది. రూ.65 వేల మొత్తానికి సరిపడా కాలం చెల్లిన ఉపకరణాలు ఐదు వాహనాల్లో తరలించడంపై పరిశీలన చేపట్టారు. దీనిలో ఆసక్తికరమైన విషయాలు బయటికి వచ్చాయి. వేలం పాటలో రంగరాయ బృందం చేసిన పొరపాటును శ్రీను తనకు అనుకూలంగా మార్చుకున్నాడని కమిటీ నిర్ధారణకు వచ్చారు. ప్రకటనలో ‘లాట్‌లు’ అని ప్రస్తావించిన యాజమాన్యం లాట్ బరువుని ఎక్కడా పేర్కొనలేదు. దీంతో లాట్‌ను తనకు అనుకూల బరువుకి సిద్ధం చేసి శ్రీను తరలింపునకు పూనుకున్నాడు. వేలం ప్రక్రియ అనంతరం కళాశాల యాజమన్యం విడుదల చేసిన తరలింపు మార్గదర్శకాల్లో కేవలం వర్కింగ్ డేస్‌లోనే తరలించాలని పేర్కొన్నా పాటదారుడు ఉద్దేశపూర్వకంగానే కళాశాల సెలవు దినం(ఆదివారం) నాడు తరలించాడని తేల్చారు. అందుకు, ఆర్‌ఎంసీ అటెండర్ భాస్కర్‌తోపాటు, జమేదార్ ఉమాశంకర్ సహకరించారని నిర్ధారించారు. ఈ అవినీతి తంతులో వారిని బాధ్యుల్ని చేస్తూ భాస్కర్, ఉమాశంకర్‌లపై శాఖాపరమైన చర్యలకు కమిటీ సిఫార్సు చేసింది. ఇదే విషయాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్‌కు యాజమాన్యం నివేదించింది. లేడీస్ హాస్టల్ వార్డెన్ ఫిర్యాదుతో కదిలిన అవినీతి డొంకలో ఆమె ప్రత్యేకించి ప్రస్తావించిన సుమారు రూ.50 వేలు విలువ చేసే మంచినీటి మోటార్లను కమిటీ రికవరీ చేసి హాస్టల్‌కు అప్పగించింది.

సీఎం జగన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- 24న కొవ్వూరులో సభ
- జగనన్న విద్యాదీవెనలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- అధికారులతో సమీక్షించిన హోం మంత్రి వనిత



సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి వనిత, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎంపీ భరత్ రామ్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొవ్వూరులో ఈనెల 24 జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆమె గురువారం ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు.

ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ అన్నిశాఖలూ సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రస్థాయి జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొంటారన్నారు.

అనువైన స్థలాల పరిశీలన

సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కొవ్వూరు పట్టణంలో సభావేదిక, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను పరిశీలించామన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సమయం తక్కువ ఉన్నందున అధికారులు తమకు కేటాయించిన విధులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సభావేదిక వరకూ రోడ్‌షోకు సంబంధించిన ఏర్పాట్లను కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హెలిప్యాడ్, రోడ్ షో, సభావేదిక వద్ద కట్టుదిట్టమైన భద్రత, పోలీసు బందోబస్తుతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు పార్కింగ్ సౌకర్యం కోసం స్థలాలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు ‘దిశ’ పోలీసు స్టేషన్

- కేసుల పర్యవేక్షణకు డీఎస్పీ స్థాయి అధికారి
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

అమలాపురం టౌన్: బాలికలు, మహిళల రక్షణకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో దిశ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయనున్నామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. అమలాపురం ఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే జిల్లాలో దిశ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుందని చెప్పారు. ఆ కేసుల పర్యవేక్షణ, ప్రత్యేక విచారణ కోసం డీఎస్పీ స్థాయి అధికారిని కూడా నియమిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా

సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా మరింత పెంచామని డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. సైబర్ నేరాలతో పాటు లోన్ యాప్‌లతో ప్రజలు ఎక్కువగా మోసపోతున్న పరిణామాలపై దృష్టి పెట్టామన్నారు. ఇప్పటికే సైబర్ నేరాలపై ఆయా జిల్లాల్లో కొంత మంది పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించామని చెప్పారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో ఇద్దరు కానిస్టేబుళ్లకు ఈ నేరాలపై అవగాహన కల్పించి శిక్షణ ఇప్పించనున్నామని వివరించారు. సైబర్ నేరాలకు ఎక్కువగా మహిళలు మోసపోతున్న క్రమంలో వారికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఆ మోసాల బారిన పడకుండా చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఐజీ

గంజాయి నిర్మూలనకు ప్రణాళిక

రేంజ్ పరిధిలో గంజాయిని సమూలంగా నిర్మూలిస్తున్నామని డీఐజీ తెలిపారు. ఇందుకోసం ప్రణాళిక రూపొందించుకుని చర్యలు చేపడుతున్నామన్నారు. అయిదారేళ్ల నుంచి గంజాయి అక్రమ రవాణా, అమ్మకాల్లో ఉన్న నేరస్తులను గుర్తించి వారి ద్వారా మూలాల్లోకి వెళ్లి నేరగాళ్ల భరతం పడుతున్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నేరగాళ్లు ఎవరు... ఎక్కడ నుంచి మన జిల్లాలకు గంజాయి సరఫరా అవుతోంది అనే విషయాలపై ఆరా తీసి చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే గంజాయి కేసుల్లో చిక్కుకున్న నేరగాళ్లపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నామని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో గంజాయి తాగుతూ పట్టుబడ్డ యువకులను గుర్తించి వారితో పాటు వారి తండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ కె.లతా మాధురి పాల్గొన్నారు.

వేళ కాని వేళ ‘అల’ జడి



ఉప్పాడలో కోతకు గురైన ఇళ్లు

సముద్రంలో సంభవించిన మార్పులతో ఉవ్వెత్తున కెరటాలు ఎగసిపడుతున్నాయి. బీచ్ రోడ్డులో ఇళ్లను సైతం కెరటాలు తాకుతూ భయాందోళన కలిగిస్తున్నాయి. తుపాను లాంటివి ఏమీ లేని సమయంలో కెరటాల తీరు చూసి మత్స్యకారులు భయపడుతున్నారు.

అమావాస్య కావడంతో అలల ఉధృతి పెరిగి ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అలల ఉధృతికి బీచ్ రోడ్డులో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.



– కొత్తపల్లి బీచ్ రోడ్డులో వెలుతున్న కారుపై ఎగసి పడుతున్న అలలు

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

నియోజకవర్గాలలో 23న నిర్వహణకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను నియోజకవర్గ, జిల్లాస్థాయిలో సన్మానించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్, ఇతర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈనెల 23న అన్ని నియోజకవర్గాల స్థాయిలోను, 27న జిల్లా స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలోప్రత్యేక కార్యక్రమం నిర్వహించి పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సన్మానిస్తారని కలెక్టర్ చెప్పారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు నగదు బహుమతి, పతకం, సర్టిఫికెట్, జ్ఞాపిక అందిస్తామన్నారు. పదోతరగతి పరీక్షలకు సంబంధించి ఏప్రిల్ 23, ఇంటర్మీడియట్ పరీక్షలకు మార్చి 2023 పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేసేలా ఏర్పాటు చేయాలని చెప్పారు. వీసీలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవీఎస్ అన్నపూర్ణ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా

గృహ నిర్మాణ పనులు వేగవంతం

ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కెవిఎస్ జవహర్ రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ..జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. త్వరలో సామూహిక గృహప్రవేశ ప్రారంభోత్సవాలకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కృషి చేయాలన్నారు. సమగ్ర భూ సర్వేలో భాగంగా భూ సరిహద్దు రాళ్ల ప్రక్రియ, భూ హక్కు పత్రాల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులకు అవసరమైన మిగిలిన భూ సేకరణ, వైఎస్సార్ యంత్ర సేవా, జగనన్న పాల వెల్లువ పథకాలకు లబ్ధిదారుల గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్వో కె శ్రీరమణి, సీపీవో పి త్రినాథ్, వ్యవసాయశాఖ జేడీ ఎన్ విజయకుమార్, మత్స్యశాఖ అధికారి పి సత్యనారాయణ, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరావు, హౌసింగ్ పీడీ బి సుధాకర్ పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ అధికారులు, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు నారాయణమూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసుల నమోదు

అంబాజీపేట: మండలంలోని కె.పెదపూడి గ్రామ దేవత రావులమ్మ తీర్థంలో ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చైతన్య కుమార్ చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న కె.పెదపూడి గ్రామ దేవత తీర్థం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ఒక బాలిక తీర్థం చూసేందుకు వచ్చింది. తీర్థంలో బాలిక పట్ల పుల్లేటికుర్రుకు చెందిన మర్రి కిరణ్, అంబటి రాజేష్, వరసాల రమేష్, బొంతు లాలూ కిరణ్, కాగితపు బాబి, గంటి సాయితేజ, అంబటి సాయి అసభ్యంగా ప్రవర్తించడంతో వారిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అమ్మవారి తీర్థంలో యర్రా సురేష్, చిక్కం సతీష్, ఏసు బాబు, కోలా మణి కంఠ, యర్రంశెట్టి వెంకటేశ్వర రావు, సూరవరపు సురేష్ కలిసి పుల్లేటికుర్రుకు చెందిన అంబటి రాజేష్‌పై దాడి చేసి గాయపరిచి, కులం పేరుతో దూషించారన్నారు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై చైతన్య కుమార్ చెప్పారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ ప్రతిభ


ఎం.నందిని


కె.రేణుక


కె.శిరీషా


టి.సౌజన్య

తుని: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ కె.వీర్రాజు గురువారం తెలిపారు. మాకినీడి నందిని ఎంపీసీఎస్ గ్రూపులో పదికి పది పాయింట్లు సాధించిందన్నారు. ఎంసీసీఎస్‌లో కె.రేణుక 9.6/10, ఎంఈసీఎస్‌లో కె.శిరీషా 9.53/10, బయోటెక్‌లో టి.సౌజన్య 9.5/10, ఎంపీసీలో కె.రేష్మ 9.5/10, సీబీజెడ్‌లో బి.ఉషశ్రీ 9.2/10, బీకాంలో పీవీ సాయి వాణి 9/10 పాయింట్లు సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు అభినందించారు.

అయ్యోర్లకు తీపి కబురు

- పదోన్నతులకు లైన్ క్లియర్
- తొలుతగా పీజీటీలకు
- టెంటేటివ్ సీనియారిటీ జాబితాల విడుదల
- జిల్లాలో 1,210 పోస్టులకు ప్రమోషన్లు



రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. అందుకనుగుణంగా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎం, ప్లస్-2 పాఠశాలల్లో పీజీటీలుగా స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు దక్కనున్నాయి. పదోన్నతులతో పాటుగా బదిలీలు కూడా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. పాఠశాలలు పునఃప్రారంభం లోగా పదోన్నతులు, బదిలీలు నిర్వహించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

20న పీజీటీల కౌన్సెలింగ్

ప్లస్-2 పాఠశాలల్లో పీజీ టీచర్ల కౌన్సెలింగ్‌కు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సబ్జెక్టుల వారీగా టెంటేటివ్ సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఆయా పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఇప్పటికే ఖాళీలను ప్రదర్శించారు. ఆయా సబ్జెక్టుల్లో ఖాళీల భర్తీకి స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ అనంతరం శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 324 పీజీ టీచర్ల పదోన్నతులు చేపట్టనున్నారు. ఉదయం 10గంటలకు కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితం, బోటనీ, జువాలజీ, మధ్యాహ్నం మూడు గంటలకు తెలుగు, ఇంగ్లిషు, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టు టీచర్లకు పీజీటీ పదోన్నతులకు కాకినాడలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

సబ్జెక్టు టీచర్ల సర్దుబాటు రద్దు

గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేసింది. ఈ ఏడాది జనవరిలో ఎస్‌జీటీలకు పని సర్దుబాటు కల్పించి, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చింది. దీని ఫలితంగా పలు పాఠశాలల్లో పది ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. సబ్జెక్టు టీచర్ల సర్దుబాటులో భాగంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ పొందిన టీచర్‌కు నెలకు రూ.2,500 చెల్లించేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పుడు ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్లకు పూర్తి స్థాయిలో పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జనవరిలో సర్దుబాటులో భాగంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ తీసుకున్న ఉపాధ్యాయులకు రెండు రోజుల్లో రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 పదోన్నతులు కల్పించనున్నారు. ఈ విధంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 886 మంది ఎస్‌జీటీలు, ఎస్‌ఏలకు పదోన్నతులు లభించనున్నాయి.

ప్రక్రియ ఇలా..

తొలుత పీజీటీలకు, అనంతరం ఎంఈవో-2, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు, అనంతరం స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, చివరగా ఎస్‌జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. పదోన్నతులు ఆఫ్‌లైన్‌లో నిర్వహించి, బదిలీలు ఆన్‌లైన్‌లో నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉపాధ్యాయ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

ఇవీ వివరాలు..

క్యాడర్	ఖాళీలు
గ్రేడ్-2 హెచ్‌ఎంలు	37
పీజీటీ తెలుగు	46
పీజీటీ ఇంగ్లిషు	46
పీజీటీ గణితం	39
పీజీటీ ఫిజిక్స్	46
పీజీటీ కెమిస్ట్రీ	46
పీజీటీ బోటనీ	37
పీజీటీ జువాలజీ	37
పీజీటీ కామర్స్	09
పీజీటీ ఎకనామిక్స్	09
పీజీటీ సివిక్స్	09
స్కూల్ అసిస్టెంట్ గణితం	135
స్కూల్ అసిస్టెంట్ బీఎస్	113
స్కూల్ అసిస్టెంట్ ఎస్ఎస్	119
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్	264
స్కూల్ అసిస్టెంట్ పీఈ	218
మొత్తం	1,210

ఎఫ్ఆర్22-బి వర్తింపజేయాలి



ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లకు ఇచ్చే పదోన్నతుల మాదిరిగానే పీజీజీ పదోన్నతులకు కూడా ఎఫ్ఆర్-22బి వర్తింపజేయాలి. ప్రభుత్వం పదోన్నతులు, బదిలీల ప్రక్రియను చేపట్టడం ఆహ్వానించదగ్గ పరిణామం. మిగిలిన సమస్యల పరిష్కారంలో ఇదే మాదిరిగా చొరవ చూపాలి.

– చింతాడ ప్రదీప్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, కాకినాడ

ఉపాధ్యాయుల పక్షపాతిగా..



ప్రభుత్వం ఉపాధ్యాయుల పక్షపాతిగా వ్యవహరిస్తోంది. అందుకే ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకుంటోంది. పదోన్నతులు, బదిలీలను ఏక కాలంలో నిర్వహించడం సంతోషించదగ్గ విషయం.

– వీరవల్లి గోపీకృష్ణ, ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ టీఎఫ్, కాకినాడ జిల్లా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని పెనుమర్తి గ్రామ సర్పంచ్ పెంకే ఆనందకుమార్ కుమారుడు పెంకే శివ వీర నాగేంద్రకుమార్ (22) గురువారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏపీఎస్పీ వద్ద మీ షా ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న నాగేంద్రకుమార్ ఉదయం 7.45 గంటలకు విధి నిర్వహణ కోసం బయలుదేరాడు. ఏడీబీ రోడ్డులో పాముగుంట సమీపంలోని బంక్‌లో పెట్రోలు పోయించుకుని తిరిగి రోడ్డుపైకి వస్తుండగా వేగంగా వస్తున్న ట్రాలీ అతనిని ఢీకొంది. నాగేంద్ర తల, మొండెం మీదుగా చక్రాలు వెళ్లిపోవడంతో శరీర భాగాలు నుజ్జయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఆనందరావు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని భోరున విలపించారు. మృతదేహాన్ని తిమ్మాపురం పోలీసులు పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సాయంత్రం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఇద్దరు కుమారుల్లో పెద్ద వాడైన నాగేంద్రకుమార్ మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: తమ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి తమపై దాడి చేశారని చేసిన ఫిర్యాదుపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని హసన్‌బాదకు చెందిన వల్లు కనకరత్నం ఆమె కుటుంబ సభ్యులు ఆస్తి విషయంగా గొడవ పడుతుండగా, కంచి శ్రీను, కంచి పద్మ, కంచి చంద్రశేఖర్, కంచి కరుణ్‌కుమార్‌లు తనపైన, తన భర్త వెంకటరావుపైన కర్రలతో దాడి చేసి గాయపరిచారని కనకరత్నం ఫిర్యాదు చేసిందన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన బోధన

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పద్మరాజు


ఆచార్య పద్మరాజు

రాజానగరం: తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద యూనివర్సిటీగా ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీని ఆ స్థాయిలో అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని, ఇందుకు సమష్టి కృషితో ముందంజ వేస్తామని ఉపకులపతి ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు అన్నారు. ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మీడియాతో మాట్లాడుతూ యూనివర్సిటీ పట్ల తన విజన్‌ని తెలియజేశారు. జేఎన్‌టీయూ నుంచి వచ్చిన తాను 'నన్నయ' అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తానన్నారు. ఎగ్జామినేషన్, అఫిలియేషన్‌లను ఆటోమేషన్ చేస్తామన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తూ, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సూచనలు, సలహాల మేరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

- ప్రపంచ దేశాలలో యువశక్తి అపారంగా ఉన్న దేశం భారత్ మాత్రమేనని, ఆ యువశక్తిని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే అద్భుతమైన ఫలితాలను అందుకోవచ్చన్నారు. భారతదేశంలోని యువతకు విదేశాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ కారణంగా ఆయా సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకుని, యూనివర్సిటీ స్థాయి నుంచే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయదలచామన్నారు. తద్వారా యూనివర్సిటీ ప్రగతి కూడా ముందంజ వేస్తుందన్నారు.
- ప్రస్తుతం యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థులు ఉంటున్న వసతి గృహాలను తక్షణమే మెరుగుపరచదలచామని వీసీ తెలిపారు. గదులకు, విద్యార్థుల సంఖ్యకు పొంతన లేకుండా ఉన్నాయని, ఆవిధంగా ఉండటం వలన విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతిని, చదువు పై ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం బాయ్స్, గరల్స్‌కి రెండు హాస్టల్స్ ఉన్నాయని, వీటికి అదనంగా మరో రెండు నిర్మించవలసి ఉందన్నారు. ప్రాంగణంలో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అవి పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలు ఏమిటి, వాటిని ఏవిధంగా పరిష్కరించాలనే విషయాలను పరిశీలిస్తున్నామన్నారు.
- క్యాంపస్‌లో సమయపాలనను పాటిస్తూ, క్రమశిక్షణను పాటించటంలో విద్యార్థులే కాదు సిబ్బందిని బాధ్యులను చేయదలచామన్నారు. గతంలో ఈ క్యాంపస్‌లో గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన విషయాన్ని ప్రస్తావించగా పై విధంగా చెప్పారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులలో కూడా అనేక మార్పులు తీసుకురావలసిన అవసరం ఉందన్నారు. ఇందుకు శాఖల వారీగా పరిశీలన చేస్తున్నానని వీసీ ఆచార్య పద్మరాజు తెలిపారు.

పశువుల శాల దగ్ధం

- నాలుగు పాడిగేదేలు, ఆవు, దూడ, మేక మృతి
- రూ.10 లక్షల ఆస్తి నష్టం


ప్రమాదంలో కాలిపోయిన పశువుల శాల

నల్లజర్ల: మండలంలోని తూర్పుచోడవరంలో రైతు మద్దిపాటి శ్రీనుకు చెందిన పశువులశాల గురువారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో నాలుగు పాడిగేదెలు, ఆవు, దూడ, మేక, గడ్డి చాప్ కట్టర్, మోటారు,, వ్యవసాయ యంత్ర సామగ్రి, ధాన్యం బస్తాలు కాలిబూడిదయ్యాయి. రైతు శ్రీను ఉదయమే వేరే గ్రామానికి వెళ్లారు. పాలేరు పశువులకు మేత, నీలల్లు పెట్టి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మంటలు ఎగిసిపడటంతో రహదారి వెంట వెళ్లేవారు చూసి తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి జీవీ రామారావుకి సమాచారం ఇవ్వడంతో వారు సిబ్బందితో వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే గెదేలు చనిపోయాయి. తొలుత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించి ఉండవచ్చునని భావించారు. తర్వాత ఈ పశువుల శాలకు దగ్గర్లో ఉన్న పుంతలో కొంతమంది నిప్పు వెలిగించి తుక్కు తగులబెట్టారని, అక్కడ నుంచి నిప్పురవ్వలు ఈపశువుల శాల వరకు వచ్చినట్టు భావిస్తున్నారు. నష్టం విలువ రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. గ్రామకార్యదర్శి కె.శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి ఫర్జానా ఘటన స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఆంజనేయులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని పోలీసులు కనుగొన్నారు. తొమ్మండ్రు ఆంజనేయులు(33) నిత్యం అతిగా మద్యం సేవిస్తూ ఉంటాడు. బుధవారం రాత్రి అదేవిధంగా మద్యం తాగి వచ్చి పడుకున్నాడు. గురువారం ఉదయం చూడగానే మృతి చెంది ఉన్నాడు. అతిగా మద్యం తాగడం వల్లే చనిపోయాడా? లేదా మరే ఇతర కారణాల వల్లనా? అన్న సంశయంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతునికి భార్యపద్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

రూ.2 లక్షల విలువైన సరకు స్వాధీనం


నిందితులు, గంజాయి మూటలతో పోలీసులు

గండేపల్లి: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురిని గండేపల్లి మండలం మల్లేపల్లి శివారులో అరెస్ట్ చేసినట్టు జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై లగేజ్ బ్యాగ్‌లలో రూ.2 లక్షల విలువ గల 21 కేజీల గల పది ప్యాకెట్ల గంజాయిని రెండు బైకుల వద్ద గుర్తించినట్టు తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం, కర్లపాలెం గ్రామానికి చెందిన షేక్ హసీన్ బాషా, ఖాజా గరీబ్, పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, నరసరావుపేట గ్రామానికి చవపటి ఉమర్ సాదిక్, పల్నాడు జిల్లా ఇస్లంపేట మండలం, నరసరావుపేట గ్రామానికి చెందిన పసుపులేటి డెరిక్ ప్రిన్స్ లను తహసీల్దార్ కేవీవీ సత్యనారాయణ, వీఆర్వో వీర్రాజు, తదితరుల సమక్షంలో అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు. వీరికి గంజాయిని సప్లైచేసిన చింతపల్లి ప్రాంతానికి చెందిన రాజు పరారీలో ఉన్నాడని తెలిపారు. గండేపల్లి ఎస్సై వై. గణేష్ కుమార్, ఏఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.